# కోటి వృక్షార్జన కార్యక్రమం అద్భుతమైనది

**ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి**
**పర్యావరణానికి పాటుపడాలి**
**ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టితో తెలంగాణలో**
**అటవీ శాతం ,గ్రీనరి శాతం ఘనంగా పెరిగింది**
**తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో కూడా ఎంతో**
**గొప్పగా అభివృద్ధిని సాధించింది.**
**ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**



**కోదాడ ,ఆగస్టు 26(వాయిస్ టుడే ప్రతినిధి):** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి పర్యావరణానికి పాటుపడాలని కోదాడ అభివృద్ధి ప్రదాత శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. శనివారం కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా కోదాడ పట్టణంలోని కట్టకొమ్ముగూడెం బైపాస్ వద్ద మొక్కలు నాటిన ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత హరితహారం అనే మహోన్నత కార్యక్రమాన్ని నిర్వహించించిందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టితో తెలంగాణలో అటవీ శాతం ,గ్రీనరి శాతం ఘనంగా పెరిగిందని అన్నారు.తెలంగాణ రాష్ట్రాన్ని ఆకుపచ్చని రాష్ట్రంగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కి దక్కిందని అన్నారు . తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో కూడా ఎంతో గొప్పగా అభివృద్ధిని సాధించిందని ఆయన అన్నారు.దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తెలంగాణ రాష్ట్రం ఎదగడం గర్వకారణం అని తెలియరు.హరితహారం లో భాగంగా చేపట్టిన కోటి వృక్షార్జన కార్యక్రమం అద్భుతమైనదని ఆయన అన్నారు.ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు.హరితహారం వల్లే వాతావరణ సమతుల్యం ఏర్పడింది. సకాలంలో వర్షాలు పడుతూ ప్రజలు పాడిపంటలతో సంతోషంగా ఉన్నారు.తెలంగాణకు ముందు చుక్క నీరు లేని పరిస్థితుల నుంచి నీరు ఇక చాలు అనే దాకా వచ్చిందని అన్నారు. ఇదంతా సీఎం కెసిఆర్ వల్లే సాధ్యం అయిందని ఆయన అన్నారు.హరితహారం కార్యక్రమం వల్ల రాష్ట్రంలో 7.7% గ్రీనరీ పెరిగింది.ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి పర్యావరణానికి పాటుపడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, పట్టణ కౌన్సిలర్లు, అటవీ వివిధ శాఖల అధికారులు మహిళలు స్థానిక ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# కోదాడలో అసమ్మతా.. అక్కసా?

**ముగ్గురు ఆశావహుల్లో ఎవరి దారి వారిదే!**
**ఐక్యతతో ఒకరి పేరు మరొకరు చెప్పలేని దుస్థితి!**
**నిన్నటి వరకు నాకే టిక్కెట్ అంటూ వ్యక్తిగత ప్రచారం**
**ఓ పెద్దాయన నియోజకవర్గ నాయకులకు**
**ఫోన్లు - ఆలయంలో పూజలు..**
**మరొకరేమో గోడల మీద రాతలు..**
**ఎర్నేని మాత్రమే కన్మంతరెడ్డికి మద్దతు ..**
**గురువిందలా ఎమ్మెల్యేపై వ్యక్తిగత అసత్య ఆరోపణలు**
**2014లో బొల్లంకు వెన్నుపోటు**
**పొడిచిందెవరో ప్రజలందరికీ తెలుసు**
**విమర్శలు పట్టించుకోకుండా ముందుకు**
**సాగుతున్న ఎమ్మెల్యే బొల్లం..**
**మరోసారి గెలిపించేందుకు సబ్బండ వర్గాల సంసిద్ధత!**
**మల్లయ్య యాదవ్ గెలుపు నల్లేరు మీద నడకే!**



**కోదాడ ,ఆగస్టు 26(వాయిస్ టుడే ప్రతినిధి):** స్వంత గడ్డపై మమకారంతో 2007లో రాజకీయ ఆరంగేట్రం చేసిన బొల్లం మల్లయ్య యాదవ్ గత 15 సంవత్సరాలుగా నియోజకవర్గ ప్రజలతో అనుబంధాన్ని పెంచుకొని, కుటుంబ సభ్యుడిగా కష్టనష్టాల్లో భాగస్వామ్యం అవుతూ మన్ననలు పొందుతున్న విషయం తెలిసిందే. అందుకు ప్రతిఫలంగా మెజార్టీ ప్రజల అభిప్రాయ సేకరణతో నియోజకవర్గంలో 85% దళిత బహుజనుల ప్రతినిధిగా ముఖ్యమంత్రి కేసీఆర్ 2018లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిపితే ప్రజలు మద్దతిచ్చి గెలిపించారు. అప్పటి నుంచి 24/7 ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా వారి ముంగిటికే వెళ్ళి అందజేయడంతో పలు సర్వేలను అనుసరించి తిరిగి రెండోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఖరారు చేసిన విషయం తెలిసిందే. అయితే ఎమ్మెల్యేగా బొల్లం మల్లయ్య యాదవ్ గెలిచి పట్టుమని 10 నెలలు ముగియకముందే ఆయన ఎదుగుదలను ఓర్వలేక రాజకీయ కురువృద్ధుడు పెద్దాయనతో పాటు మరికొందరు అసమ్మతి పేరుతో అక్కసు వెళ్లగకుతూ వ్యక్తిగత ప్రతిష్టను దిగదా ర్చేందుకు చేస్తున్న ప్రయత్నం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు ప్రాధాన్యతా క్రమంలో అన్ని రంగాలను అభివృద్ధి చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలకు అడ్డుపడుతూ తమను బేఖాతర్ చేయడం లేదని, గౌరవించడం లేదని వారే దూరమై ఇప్పుడు ఎమ్మెల్యే తమని పట్టించుకోవడం లేదని అసమ్మతి రాగాలు వినిపించడం వారి ఆధిపత్య భావజాలాన్ని స్పష్టం చేస్తుందంటున్నారు. రెండోసారి టిక్కెట్ ఖరారు చేసినందుకు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు సంబరాలు చేసుకుంటుంటే వీరు మాత్రం అసమ్మతి పేరుతో అక్కసు వెళ్లగక్కడం సమంజసం కాదంటున్నారు. పోనీ ముగ్గురు ఆశావహుల్లో ఒకరిపై మరొకరు నమ్మకం ఉందా అంటే అదీ లేదు, నిన్నటి వరకు అధిష్టానం తనకే టిక్కెట్ ఖరారు చేసిందని గోండ్రియాల దేవాలయంలో పూజలు నిర్వహించి పలువురి నాయకులకు ఫోన్లు చేసి మద్దతివ్వాలన్నది వాస్తవం కాదా అని ప్రశ్నిస్తుండగా, మరో యువ నేత ఇప్పటికే నాకే టిక్కెట్ అంటూ గోడలపై రాతలు రాయించగా, బీఆర్ఎస్ నియోజకవర్గ మాజీ ఇన్ చార్జ్ తనకే టిక్కెట్ వస్తుందని ప్రచారం నిర్వహించిన విషయం తెలిసిందే. ఆయనకు చోటా మోటా నాయకులతో పాటు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేశారని రాష్ట్ర కార్యదర్శి ఎర్నేని మాత్రమే మద్దతు పలికారు.. ఆశావహుల్లో సమిష్టిగా ఒక్క పేరును సూచించలేని పరిస్థితుల్లో అధిష్టానం వారి అక్కసును పరిగణలోకి తీసుకునే దాఖలాలు లేవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజాక్షేత్రంలో ప్రజాప్రతినిధులపై అవినీతి ఆరోపణలు సహజమేనని, అయితే తాము ఎమ్మెల్యే కాకముందు, ఆ తర్వాత ఆస్తులు ఏ స్థాయిలో పెరిగాయో ప్రజలకు తెలుసునని, 10 ఎకరాల నుచి 300 ఎకరాలకు పైగా ఆస్తులను చెమటోడ్చి సంపాదించారా అనే విషయం ప్రజలకు స్పష్టమైన అవగాహన ఉందని ఆరోపణలు చేయటం గురివింద చందంగా ఉందని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**ఈర్ష తప్ప మరేమీ లేదు..**

ఒకరిపై ఆరోపణలు చేసేటప్పుడు ఆత్మవిమర్శ చేసుకోవాలంటున్నారు. ఎమ్మెల్యే బొల్లం మరోసారి గెలిస్తే రాజకీయంగా మరింత ఎదుగుతారనే ఈర్ష్య తప్ప మరేం లేదని, తమ ఉనికి ప్రశ్నార్థమవుతుందనే ఆలోచనతోనే ఆరోపణలు చేస్తున్నారని భావిస్తున్నారు. తమ అభిప్రాయాన్ని ప్రజల అభిప్రాయంగా, ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారని వ్యాఖ్యానించడం సరైంది కాదంటున్నారు.

10 సంవత్సరాల క్రితమే అధిష్టానాలు ప్రస్తుత రాజకీయాలకు సరికావని 2014లో అప్పటి టీడీపీ అధిష్టానం పెద్దాయననుకాదని ఎమ్మెల్యే బొల్లంను ఎన్నికల బరిలో నిలిపితే వెన్నుపోటు పొడిచిందెవరో ఇప్పటికీ ప్రజలు మరువలేదనే విషయం గుర్తుచేసుకోవాలన్నారు.

ద్వితీయ శ్రేణిని ఎదగనీయని సీనియర్ నాయకుడు%ూ

%ఆ సీనియర్ నాయకుడు ఎమ్మెల్యేగా ఉన్న హయాంలో ద్వితీయ శ్రేణి నాయకులెవరినీ ఎదగనివ్వని మాట వాస్తవం కాదా!, దాసిరెడ్డి, చంద్రమౌళి, పాలేటి నాగేశ్వరరావు, జెట్టి వెంకటరెడ్డి, పాండురంగారావు, పార సీతయ్యలను పొమ్మనలేక పొగపెట్టి రాజకీయంగా ఎదగనివ్వని మాట వాస్తవం కాదా అని ప్రశ్నిస్తున్నారు.

ఇప్పటికీ వీరిలో ఇద్దరు తప్ప మిగిలినవారు ప్రజాక్షేత్రంలో ఉన్నారు. వారిని అడిగితే ద్వితీయ శ్రేణి నాయకులపై ఏ పార్టీ గౌరవం ఉందో బట్టబయలవుతుందని చెబుతున్నారు. తన పదవీకాలం ముగియక ముందే పెద్దాయనపై ఆరోపణలు చేసి 6 నెలలకు ముందే కోదాడ ఎంపీపీ పదవికి పాండురంగారావు రాజీనామా చేసిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. ఒకటిన్నర సంవత్సరం నుంచి బీఆర్ ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీశ్వర్ రెడ్డిలు తనకు సహకరించడం లేదని ప్రత్యక్షంగానే దుర్భాషలాడుతూ, ఆ పార్టీతో తనకే సంబంధం లేదని వ్యాఖ్యానించిన డీసీసీబీ మాజీ అధ్యక్షుడిని విలేకర్ల సమావేశంలో అధినాయకులను తిట్టించిన విషయం తెలిసిందే. ఇదేనా అధినాయకులపై మీకున్న అభిమానం అని నిబద్ధత గల పార్టీ శ్రేణులు నిలదీస్తున్నారు.

**తన పని తాను చేసుకు పోతున్న ఎమ్మెల్యే%ూ**

ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ మాత్రం అసమ్మతిని, అక్కసును పట్టించుకోకుండా సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. అసమ్మతి అంశంపై అధిష్టానం, ప్రజలే చూసుకుంటారని, ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమం, వ్యక్తిగతంగా ప్రజల్లో తనకున్న ఆదరాభిమానాలే రెండోసారి తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాయని ముందుకు సాగుతున్నారు.

## సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ కమిటీ



**హైదరాబాద్, ఆగస్టు 26:** రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ టెక్నికల్ కమిటీ సభ్యులుగా వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్‌కు చెందిన నాగం సురేందర్‌రెడ్డి, చీరపల్లికి చెందిన దొడ్ల రాములు నియమితులయ్యారు. అప్పీల్ కమిటీ సభ్యుడిగా ఖిల్లాఘణపురం మండలం మామిడిమాడకు చెందిన తూము శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సేంద్రియ ఉత్పత్తుల నాణ్యతా ప్రమాణాలను సాంకేతిక కమిటీ నిర్ధారిస్తుండగా, సేంద్రియ ఉత్పత్తుల కోసం నమోదు చేసుకున్న ఫిర్యాదులపై ధ్రువీకరణ సభ్యుల విన్నపాలను అప్పీల్ కమిటీ పరిష్కరించనున్నది. దక్షిణ భారతదేశం మొత్తానికి తెలంగాణ రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ ప్రాంతీయ కేంద్రంగా ఉంది. సేంద్రియ ఉత్పత్తుల జాతీయ నియమావళి ప్రకారం ఈ సంస్థ ధ్రువీకరణ పత్రాలు అందజేస్తుంది. సేంద్రియ ఉత్పత్తుల ఎగుమతికి ఈ సంస్థ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అవసరం.

## బీజీఎల్‌లో ముగిసిన ఈడీ సోదాలు

**షేర్ల ద్వారా 868 కోట్లు సమీకరించినట్టు అనుమానం**
**300 కోట్లకు పైగా మోసాలకు పాల్పడినట్టు గుర్తింపు**

**హైదరాబాద్, ఆగస్టు 26:** బ్రైట్ కామ్ గ్రూప్ లిమిటెడ్ (బీజీఎల్) సంస్థల్లో ఈడీ దాడులు మరోసారి కలకలం రేపాయి. ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ కింద ఈ నెల 23న కంపెనీలో నిర్వహించిన సోదాల్లో రూ.3.3 కోట్ల నగదుతోపాటు రూ.9.3 కోట్ల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ తెలిపింది. కంపెనీ సీఈవో, సీఎఫ్‌వో, ఆడిటర్ ఇల్లు, కార్యాలయాల్లో శనివారం ఐదుచోట్ల సోదాలు నిర్వహించినట్టు వెల్లడించింది. ఆడిటర్ మురళీమోహన్ ఇంట్లో నగదు, బంగారం, సీఈవో సురేశ్‌కుమార్‌రెడ్డి, సీఎఫ్‌వో రాజు ఇండ్లల్లో కీలక పత్రాలు, ల్యాప్‌టాప్‌లు, హార్డ్ డిస్‌లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

## సీట్ల కోసం దరఖాస్తులు: ఉత్తం



**సూర్యాపేట, ఆగస్టు 26(వాయిస్ టుడే ప్రతినిధి):** నల్లగొండ లోక్ సభ సభ్యుడు కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గం నుండి.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా పోటీ చేయడానికి, ఈరోజు గాంధీ భవన్ లో అధికారికంగా దరఖాస్తు చేసుకున్నారు. అనంతరము వారు మీడియా తో మాట్లాడుతూ..రానున్న అసెంబ్లీ ఎన్నికల లో 70 స్థానాలలో విజయం సాధించి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా లోని మొత్తం 12 సీట్లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని అన్నారు..

## కష్టపడి పనిచేసి కాంగ్రెస్ను గెలిపించుకోవాలి పద్మావతి



**కోదాడ, ఆగస్టు26 (వాయిస్ టుడే ప్రతినిధి):** కోదాడ క్యాంప్ శనివారం కార్యాలయంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే, టిపిసి సి ఉపాధ్యక్షురాలు పాల్గొని ప్రసంగించారు. నియోజవర్గ వ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కాంగ్రెస్ నాయకులందరూ తప్పనిసరిగా చురుకుగా పాల్గొనాలి. రేపటిలోగా వారి పట్టణాలు/గ్రామాల్లో దానిని పూర్తి చేయాలన్నారు. తక్షణమే ప్రతి 100 మంది ఓటర్లలో ఒక ఓటరును ఎంపిక చేసి 100 మంది ఓటర్లకు సమన్వయకర్తగా నియమించాలన్నారు. రాబోయే 90 రోజులు అందరూ కష్టపడి పనిచేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఉత్తం పద్మావతి విజ్ఞప్తి చేశారు.

## అల్లు అర్జున్‌కు మాజీ సీజేఐ అభినందనలు

**హైదరాబాద్, ఆగస్టు 26:** జాతీయ ఉత్తమ నటుడిగా ఎంపికైన తొలి తెలుగు సినిమా కథానాయకుడు అల్లు అర్జున్‌కు సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అభినందనలు తెలిపారు. అత్యున్నత పురస్కారం ద్వారా తాత, తండ్రి, మేనమామల కీర్తి పెంచారని, తెలుగు సినిమాకు మరింత వన్నె తెచ్చారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో తెలుగు సినిమా వైభవ పతాకాన్ని రెపరెపలాడించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారు గర్వించేలా చేశారని తెలిపారు. అల్లు రామలింగయ్య వారసుడిగా వచ్చిన అర్జున్ తెలుగు సినీ పరిశ్రమను అల్లుకుపోయిన తీరు అబ్బురమని పేర్కొన్నారు. నాట్యం, నటనలో సవ్యసాచి అని నిరూపించుకున్న అర్జున్‌కి అభినందనలు తెలిపారు.

## కన్నతల్లి ఆత్మగౌరవమా? కాంగ్రెస్ రాజకీయమా?
### రేవంత్‌కు రెడ్కో చైర్మన్ సతీశ్‌రెడ్డి ప్రశ్న



**హైదరాబాద్, ఆగస్టు 26:** అధికారమే పరమావధిగా రేవంత్‌రెడ్డి దిగజారి వ్యవహరిస్తున్నాడని రెడ్కో చైర్మన్ వై సతీశ్ రెడ్డి విమర్శించారు. కన్న తల్లిని బూతులు తిట్టిన మైనంపల్లి హనుమంతరావును కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు రేవంత్ ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. ఇటీవల ఒక ఆడియోలో రేవంత్, అతని తల్లి గురించి మైనంపల్లి చేసిన వ్యాఖ్యలను సతీశ్‌రెడ్డి ఖండించారు. స్వయంగా మైనంపల్లికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలో చేర్చుకోవడానికి సిద్ధపడ్డారని రేవంత్ తీరును దుయ్యబట్టారు. రేవంత్ లాంటి వ్యక్తులకు ఇది ఒక దందాలాంటిదని, అందుకోసం కన్నతల్లి గౌరవాన్ని పణంగా పెట్టిన దుర్మార్గుడు అని మండిపడ్డారు. కన్నతల్లి అంటేనే పట్టింపు లేనివాడికి రాష్ట్ర ప్రజలు అంటే పట్టింపు ఎలా ఉంటుందని ప్రశ్నించారు.

